శీర్షిక: తొలకరి

# కోకిల

-టి. చంద్రశేఖరరావు

అయిన వారిలో ఈమె కూడా వుంది. అందుకే రిహార్సల్ చేయిస్తున్నారు' అన్నాడు.

"ఇంతకీ ఏ క్లాసో" అన్నాను.

"ఏ క్లాస్ ఏమిటి మన క్లాసే" అన్నాడు.

'ఈజ్ ఇట్' ఇంత గొప్ప గాయని మన క్లాసులో వుందా? అని ఆశ్చర్యపోయాను. చిన్నప్పటి నుంచీ నాకు అమ్మాయిలతో అసలు పరిచయాలే లేవు. అందుకే వాళ్ళన్నా, వాళ్ళతో మాట్లాడాలన్నా నా కదోలాంటి వణుకు, దానికితోడు సిగ్గు, మొహ మాటం మెండుగా వున్నాయి. ఇన్ని క్వాలిఫికేషన్స్ వున్న నాకు ఆ అమ్మాయి తెలియకపోవడంతో ఆశ్చర్యం ఏమీలేదు కదా!

తరువాత ప్రోగ్రామ్స్ లిస్ట్‌లో పేరు చూశాను. 'సాహితి' అని వుంది. 'అబ్బ ఎంత మంచి పేరు! గొంతులో కదలాడేది సంగీతమయితే. పేరులో కనపడేది సాహిత్యం. నిజంగా అద్భుతం అని మనసులో అనుకున్నాను. ఆ రోజు నుంచి ఆమె పేరు విన్నప్పుడల్లా ఆమెను చూస్తున్నప్పుడల్లా ఆమె చూపులతో నా చూపులు కలసినప్పుడల్లా ఏవో అభిమానపు కెరటాలు పొంగి పొరలుతుండేవి. ఏవో మధురభావాలు కలుగుతుండేవి. ఊహల్లో భావాలను కవితలుగా రూపొందిస్తూ వాటిలోనే ఏదో అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందేవాడిని. నా కవితా రూపమే నా కనుల ముందు కద లాడుతుండేసరికి నా హృదయవీణపై ఏవో కొత్త స్వరాలు మీటినట్లయింది.

రోజూ కాలేజీకి తొందరగా వెళ్ళటం ఆమె కోసమే ఎదురు చూడటం నా నిత్యకృత్యాల య్యాయి. నిజంగా ఆ ఎదురు చూపులో ఎంతో థ్రిల్ వుంది. ఆమె నన్ను చూడాలి అని నా మనసు పడే తపన అంతా ఇంతా కాదు. కాని ఆమె అల్లంత దూరాన కనపడగానే ఒకటే వణుకు, దడ మొదలయ్యేవి. తీరా ఆమె నా సమీపానికి వచ్చేసరికి నేను ఏదో ఒక పక్కకు తప్పకునేవాడిని. క్లాసులో నేను ప్రతిరోజు బుద్ధిగా ముందు బెంచీలో కూర్చునేవాడిని. సాహితి మాత్రం అందరికన్నా వెనుక ఆఖరి బెంచీలో కూర్చునేది. సాహితి నా మనసులో చోటు చేసుకు న్నప్పటి నుంచి నా మనసు మొత్తం ఆమె మీదనే వుండేది. దాంతో నా మనసు నన్ను ముందు బెంచీ నుంచి వెనుక బెంచీకి ట్రాన్స్‌ఫర్ చేసింది.

సాహితి ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం ముందు పెట్టుకుని వుండేది. నేను కూడా ఒక పుస్తకం ముందు పెట్టుకుని ఆమె కేసే చూస్తుండేవాడిని. ఆమె పుస్తకంలోంచి తలతిప్పి ఇటు చూసినప్పు డల్లా నాలో ఏదో ఆనందం కట్టలు తెంచుకుని పొంగుతుండేది. పదే పదే ఆ చూపులు నా మన సులో మెదుల్తూ ఎన్నో కవితలకు రూపం ఇచ్చేవి. ఇలా నేను ఆమెని ప్రేమిస్తున్నట్టు నా భావాల్ని పట్టి గ్రహించింది. ఒక రోజు రోజూకన్నా ఫ్రెష్‌గా తయారయి వచ్చింది. సిగలో ఎర్రని గులాబి పెట్టింది. ఎందుకో ఆ రోజు ఆమెనే చూస్తుండా లనిపించింది. అందుకే ఆ రోజు ఆమె జడలోని గులాబీతో ఏవేవో ఊహించుకుంటూ కనీసం ఒక తుమ్మెదనయినా ఈ గులాబీని చేరేవాడిని కదా అని ఊహించుకుంటూ ఆమె లాబ్ కెళ్ళేటప్పుడు లాబ్ నుంచి క్లాస్‌కి వచ్చేటప్పుడు ఆమె వెనకాలే నడిచాను. మధ్య మధ్యలో సాహితి వెనక్కి తిరిగి చిన్న చిన్న చిరుచూపులు చూస్తుంటే నా ఆనందం అంతా ఇంతా కాదు. అది అనుభవైకవేద్యం. ఆ రోజు ఎందుకో లెక్చరర్ రాక పీరియడ్ ఖాళీగా వుంది. సాహితి వాళ్ళ ఫ్రెండ్స్‌తో ఏదో డిస్కస్ చేస్తోంది. నేను అలానే సాహితిని చూస్తూ ఆలోచనా ప్రపంచంలో అడుగు పెట్టాను. నా మనసు ఎందుకో బలహీనమై పోతూంది. ఆమెను చూడనిదే ఒక్క క్షణం కూడా వుండబుద్ధి కావడం లేదు. ప్రతి రోజూ ఆమెకోసం ఎదురు చూడటం. ఏ రోజన్నా ఆమె రాక లేట్ అంటే వస్తుందో రాదోనన్న తపన. ఆమెను చూడాలనే ఆరాటం. ఏమిటో అర్థం కాదు. ఏదో కొత్త లోకంలో అడుగుపెట్టినట్టు అనిపిస్తుంది. ఇలా నా ఆలోచ నలలోంచి తేరుకుని చూసేసరికి సాహితి జడలో గులాబి లేదు. ఏమయిందబ్బా అనుకున్నాను. కాని ఆమె మాట్లాడుతూ తల ఊపుతుండేసరికి ఆ గులాబి పువ్వు కాస్త కిందపడింది.

గులాబి క్రిందపడిందని చెపుదామనుకున్నాను. కాని ధైర్యం చాలలేదు. పైగా చెపితే ఏమన్నా అనుకుంటుందేమో నన్న ఫీలింగ్. పోనీ తీసి ఇద్దామనిపించింది. కాని ఆమె బెంచీ దగ్గ రికి వెళ్ళాలంటే తలచుకుంటేనే గుండెల్లో దడగా వుంది. మరి ఎలా? ఎలాగయినా సరే ఆ గులా బిని నేనే తీసుకోవాలి–నాలో ఆతృత పరుగులు తీసింది. ఇంతలో మా ఫ్రెండ్ వస్తే వాడికి కింద పడ్డ గులాబిని చూపిస్తూ "ఒరేయ్ ఎలాగయినా ఆ గులాబిని తెచ్చిపెట్టరా" అన్నాను. దాంతో వాడి ధైర్యం పాడుగాను! ఆ గులాబీని తీసుకుని లవ్వర్‌కి ఇస్తున్నట్టు పట్టుకుని వాళ్ళముందే వీర లెవెల్లో నాకిచ్చాడు. అంతే సాహితి చూసింది. నా గుండెల్లో రాయి పడ్డంత పనైంది. ఏమి చెయ్యాలో అర్థం కావట్లేదు. కాళ్ళూ చేతులూ బ్రేక్, షేక్‌ని మిక్స్‌చేసి మరీ డాన్స్ చేస్తున్నాయి. మా క్లాస్‌లో ఒక వసపిట్ట వుంది. అల్లరి పిల్లగా అందరిలో గొప్ప పేరుంది ఆమెకి. ఆ రోజు ఆమె కూడా సాహితి ప్రక్కన కూర్చుంది. ఈ సన్నివేశం చూసిన ఆమె నేను సాహితిని ప్రేమిస్తున్నట్టు సగం మంది అమ్మాయిలకు చెప్పింది. ఇంతలో బెల్ అయింది. అందరూ వెళ్ళాక నేను పువ్వు పట్టుకుని క్లాస్ బయటకు వచ్చాను. ఆ రోజు మాకు ప్రాక్టికల్ క్లాసుంది. మా లాబ్‌కి వెళ్ళే దారిలోనే సాహితి నిలబడి వుంది. ఆమె ముందు నుంచి లాబ్‌కి వెళ్ళాలంటే ధైర్యం చాలడం లేదు. కాని టైం అవుతూంది. చేసేది లేక ధైర్యంచేసి ముందు కునడిచాను. అప్పటిదాకా నిలబడిందల్లా నా వైపు రావడం ప్రారంభించింది. నా చేతిలో గులాబి వుంది. నాకు వణుకు ఎక్కువైంది. ఇంతలో మా ఫ్రెండ్ అటుగా రావడంతో వాడితోపాటు పక్కకు వచ్చాను. ఆమె నా ముందునుంచి నన్ను చూసుకుంటూ వెళ్ళింది. కానీ ఏమీ అనలేదు. ఆమె వెళ్ళగానే అమ్మయ్య! అనిపించింది. ఆ రోజు గులాబిపై అందమైన కవితలు వ్రాసి ఆ గులాబిని ఎంతో జాగ్రత్తగా దాచుకున్నాను.


మా ఫ్రెండ్స్ సాహితి గురించి అప్పుడప్పుడు చెప్ప కునే వారు. సాహితి ప్రేమించినట్టే ప్రేమించి మోసం చేస్తుందని. నేను సాహితిని ప్రేమిస్తున్నట్టు తెలిసిన మా ఫ్రెండ్ ఒకడు వచ్చి 'ఆకేస్ వద్దురా. ఆ అమ్మాయి గురించి మనకొద్దు. మన క్లాస్ మేట్ నారాయణ కూడా ఆమెను ప్రేమించాడు. నారాయణకేసి చిరుచూపులు చూసి లవ్ లెటర్ ఇచ్చేదాకా చేసింది. తీరా వాడు ఇచ్చాక వాళ్ళ ట్యూషన్ సార్‌తో చెప్పి వాడికి చివాట్లు పెట్టిం చింది. సాహితి ప్రక్కనున్న ఫ్రెండ్స్‌లో ఒకామెకు గర్వం బాగావుంది. వాళ్ళందరూ కలసి నారాయ

ఱను టీజింగ్ కూడా చేశారు. "మంచి కవిగా, ఆర్టిస్టుగా మన క్లాసులో శి మీద అందరికీ అభిమానం. గౌరవం వున్నాయి. వాటిని చెడు పుకోకు" అన్నాడు. కాని నాకు తెలుసు ఆమె చూపులు నన్ను మోసం చెయ్యవని.

మరుసటి రోజు కాలేజీకి రావాలంటే ఎందుకో భయంగా అనిపించింది. కానీ రోజు ఆమె కోసం ఎదురు చూసే మనసుతో ఆగలేక అందరికన్నా ముందుగానే వచ్చాను. నా మనసులో మాత్రం ఏదో అలజడిగానే వుంది. గులాబిని తీసుకోవడం వలన సాహితి ఏమన్నా అనుకుందేమో ఆమె మనసును ఏమన్నా బాధపెట్టానేమో అని ఒకటే ఆలోచన. ఆ ఆలోచనలని కట్ చేస్తూ ఆమె వస్తూంది. సైకిల్ పెట్టి బుక్స్ తీసుకుని క్లాస్ వైపు నడుస్తూంది. నేను మా ఫ్రెండ్‌ని తీసుకుని ఆమె వెనకాలే నడవటం మొదలు పెట్టాను. మా ఫ్రెండ్‌తో మాట్లాడుతున్నట్టు "గులాబి తీసుకున్నందుకు ఏమీ తిట్టుకోరు కదా" అని బిగ్గరగా అన్నాను. ఇంతలో క్లాస్ రావడంతో ఒక చిన్న వాలు చూపు నాపై విసిరి వెళ్ళింది. అంతే!! నా ఆనందానికి అవధులు లేవు. ఆమెను తలచుకున్నప్పుడల్లా నా మనసు ఎంతో ఫ్రీగా వుండేది. కాని నేడు సాహితి నాకు దగ్గరవుతుంది అన్న నమ్మకం కలగానే ఏదో సాధిస్తున్న అనుభూతి కలుగుతోంది. ఆనాటి నుంచి నా గుండె గుడిలో ఆమెను ప్రేమదేవతగా పూజించడం మొదలు పెట్టాను.

మా విద్యా సంవత్సరం పూర్తి కావస్తుంది. అందుకే ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేశాము. ఆ పార్టీలో ఎలాగయినా సరే సాహితితో ఒక పాట పాడించాలనుకున్నాను. కాని నేను అడిగితే పాడుతుందో లేదోనన్న అనుమానం. అందుకే మాలెక్చరర్‌తో అడిగించాము. ఆమె సరే అంది. సార్ నన్ను ఎనౌన్స్ చేయమన్నారు. ఆమె గురించి వర్ణించి, చక్కటి వాక్యాలతో ఆమె పాటకు స్వాగతం పలికాను. సాహితి వసంత కోయిలలా తన గళం విప్పి మా అందరిపై రాగామృతాన్ని కురిపించింది. ఆరోజు ఆమె ఆటోగ్రాఫ్, అడ్రస్ తీసుకున్నాను. మరుసటి రోజు నుంచి ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చారు.

సెలవులలో ఆమె కనిపించక పోయేసరికి నా మనసంతా దిగులు దిగులుగా తయారయింది. అనుక్షణం సాహితి గురించే ఆలోచన. ఆమె నాది అవుతుందో కాదోనన్న తలపువస్తేనే చాలు మనసంతా గందరగోళంగా తయారవుతోంది. "ఆమె మోసం చేస్తుందిరా" అన్న మా ఫ్రెండ్ హెచ్చరిక నను పిచ్చివాడిని చేస్తోంది. నా ఈ వేదనను ఆమెకు ఎలా చెప్పాలి? ఒకవేళ ఆమె నన్ను ఫ్రెండ్లీగానే అభిమానిస్తోందా? ఆమెకు ఇష్టం లేకపోతే నన్ను అపార్థం చేసుకుంటుందేమో. నా అభిప్రాయం వలన ఇన్నాళ్ళూ నేను ఆమె మనసులో కట్టుకున్న అభిమానపు కోటలు ఈ చివరి క్షణాన కూలిపోయి జీవితాంతం చెడ్డవాడిగా ఆమె మనసులో చిత్రింప బడతానేమో అని ఒక వైపు ఆలోచన మరో వైపు సాహితికి ఇష్టంలేకపోతే గులాబి పువ్వు తీసుకున్న నాడే నా మీద ఆశలు పెట్టుకోవద్దు అని చెప్పేది. పైగా నేను తెల్లారి గులాబి తీసుకున్నందుకు తిట్టుకుంటున్నారా అని అడిగినప్పుడు చిన్నవాలు చూపు చూసింది. ఆ చూపు చాలు కదా నాపై ప్రేమ వుందని. చెప్పటానికి. ఆమె అమాయక చూపులు నన్ను మోసం చేయవు. అయినా మనసులోని మాటను చెప్పడంలో తప్పులేదు కదా. ఇప్పుడు నా ప్రేమని చెప్పకపోతే జీవితంలో ఒక అమ్మాయితో ప్రేమను పంచుకోలేకపోతినే అని జీవితాంతం ఆమెనే తలచుకుంటూ




బాధపడాలి. అందుకే ధైర్యం చేసి ప్రేమలేఖ వ్రాశాను. అందులో "మీరు నన్ను చేరకపోతే నా మరణవార్త మిమ్మల్ని చేరుతుంది" అని వ్రాశాను.

పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల మధ్యలో ఈ లెటర్ ఇవ్వటం వల్ల సాహితికి ఏమన్నా ఇబ్బంది కలిగిస్తానేమో అని. చివరి పరీక్ష దాకా వేచి వున్నాను. ఆరోజు ఆఖరి పరీక్ష. ఎందుకో ఆరోజు పదే పదే చూసింది. దాంతో నాలో నమ్మకం పెరిగింది. ధైర్యంచేసి లెటర్ ఇచ్చాను. ఆ లెటర్ ఇచ్చిన తరువాత నా మనసు ఎంతో ఫ్రీగా అనిపించింది. ఇన్నాళ్ళూ నా గుండెల్లో దాచిన ప్రేమని ఆమెతో పంచుకున్నట్లనిపించింది.

ఆరోజు సాయంత్రం ఆమెకు సాంగ్స్ కాంపిటీషన్ కూడా వుంది. కనపడితే బెస్టాఫ్‌లక్ చెప్పొదామని వాళ్ళింటి వైపు మా ఫ్రెండ్‌ని తీసుకుని వెళ్ళాను. అప్పుడే ఆమె బయల్దేరింది. వాళ్ళింటి ముందు కావడంతో బెస్టాఫ్ లక్ చెప్పలేక పోయాను. తల తిప్పి ఆమెకేసి చూడగానే చిన్న చిర్నవ్వు రువ్వింది. ఆమె వెళ్ళగానే ఎగిరి గంతేశాను.

ఒక్కసారే వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది. ఈ ప్రపంచాన్నే జయించినంత సంతోషం కలిగింది. మనసులో ఏదో చెప్పలేని ఆనందం పరవళ్ళు తొక్కుతోంది. నా ఉత్సాహాన్ని ఆపుకోలేక మా ఫ్రెండ్‌ని గట్టిగా పట్టుకుని ఊపేను. ఇన్నాళ్ళ నా నిరీక్షణ ఫలించింది. నేను కన్న కలలు నిజం కాబోతున్నాయి. ఆ రాత్రంతా నిదురపట్టలేదు. ఎప్పుడు తెలవారుతుందా ఆమెనోటినుంచి ఆమె కోకిల కంఠం నుంచి ఓ తియ్యని మాట ఎపుడు వింటానా అన్న ఆతృతతోనే ఆ రాత్రి గడిచింది.

తెల్లారి ఆమె కోసం కాలేజీకి వెళ్ళాను. సాహితి వాళ్ళ ఫ్రెండ్స్‌తో కలసి వస్తోంది. ఆమెను చూడగానే ఈసారి నాలో ప్రేమ వణుకు ప్రారంభమైంది. కాలేజీలో సర్టిఫికెట్స్ తీసుకుంది. నా కోసం చూసింది. కాని నేను వెళ్ళలేదు. వాళ్ళు బయల్దేరగానే వాళ్ళ వెనుక బయల్దేరాను. నన్ను చూసి ఆగింది. కాని నాకు ఆగాలంటే ధైర్యం చాలలేదు. నేను చిన్నగా వెడుతున్నాను. సాహితి ఆమె ఫ్రెండ్స్ నన్ను సమీపించారు. సాహితి నన్ను పిలిచింది. నేను విననట్టే వున్నాను. వాళ్ళ ఫ్రెండ్స్ చెప్పవే, చెప్పవే అని ఆమెను తొందర పెడుతున్నారు. ఆ మాటలు వింటున్న నాలో ఆనందం కేరింతలు కొడుతోంది. ఏదో విక్టరీ సాధిస్తున్నానన్న భావన నాలో పులకింతలు రేపుతుంది. ఇక నేను ఈ జీవితంలో సాధించలేనిది ఏదీ లేదనుకున్నాను. ఆమె నన్ను క్రాస్ చేసింది. నా ప్రక్కకు వచ్చింది. నా వైపు తిరిగి "మీరు అలా అంటే ఎలాగండి యు ఆర్ ఎ జస్ట్ లైక్ బ్రదర్" అంతే అని సైకిల్ వేగం పెంచింది. వెళ్తూ వెళ్తూ ఆమె వాళ్ళ ఫ్రెండ్స్‌తో "చూడవే నాకోసం చస్తా అన్న మగాళ్ళు కూడా వున్నారు" అంటూ గర్వంగా చెప్తుకుంది. ఆ క్షణంలో ఇన్నాళ్ళు నేను ఆమెపై పెట్టుకున్న ఆశలు, ఆమెతో నేను కన్న కలలు ఒక్కసారే కుప్ప కూలాయి. ఊహించని రీతిలో ఆమె నాకు ఇచ్చిన షాక్‌కి కళ్ళ వెంబడి నీళ్ళు గిర్రున తిరిగాయి. సాహితి నోటి నుంచి ఆ మాటలు వినేసరికి ఎలా మాట్లాడాలో ఏమని మాట్లాడాలో తెలియక గొంతుమూగపోయింది. అప్పుడు మా ఫ్రెండన్న మాటలు గుర్తుకొచ్చాయి. "వద్దురా ఆమె మోసం చేస్తుందని" ఆమె ఇష్టంలేని సమాధానాన్ని మాటగా చెప్పి నన్ను చంపకుండా ఇష్టం అని చెప్పి జీవితంపై ఆశలు పెంచకుండా మధ్యలో జీవచ్ఛవాన్నిచేసి వెళ్ళిపోయింది. ఇన్నాళ్ళు ఈ గుండె కొమ్మ మీద పాటలుపాడి మరో కొమ్మకు ఎగిరిపోతున్న కోకిలను చూస్తున్న చెట్టులా అలాగే నిల్చుండి పోయాను.


11-8-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక